క్లుప్తంగా

వ్యాపారులకు జరిమానా



వ్యాపారులతో మాట్లాడుతున్న కార్యదర్శి వెంకట శ్రీనివాసరావు

సాక్షి ఎఫెక్ట్...

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలో చెత్త సమస్య వేధిస్తుంది. చాలా మంది వ్యాపారులు రోడ్లపైనే చెత్తను పడేస్తుండడంతో పారిశుద్ధ్యం క్షీణిస్తుంది. ఈ సమస్యపై ఈ నెల 21వ తేదీన చె(త్త) శుద్ధిలేదు! శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన పంచాయతీ అధికారులు రోడ్లపై చెత్తను వేస్తున్న వ్యాపారులను గుర్తించి శుక్రవారం జరిమానా విధించి వసూలు చేశారు. టెక్కలి అంబేడ్కర్ జంక్షన్ నుంచి ఇందిరాగాంధీ జంక్షన్ వరకు ఉన్న షాపుల యజమానులతో మాట్లాడి ప్రతి ఒక్కరు చెత్త బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి ఎ.వెంకట శ్రీనివాసరావు ఆదేశించారు. మరోసారి రోడ్లపై చెత్తను వేసి ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తే కేసునమోదు చేస్తామని హెచ్చరించారు.

మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి



మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సోంపేట: స్వయంశక్తి సంఘాల మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ అన్నారు. మూలపొలం గ్రామంలో సముద్రపు నాచు, మండ పీతల పెంపకం, వనామీ రొయ్యల సమీకృత సాగుపై డీఆర్‌డీఏ, మత్స్యశాఖ, ఉదయ్ ఆక్వా ఆధ్వర్యంలో మహిళలకు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు సముద్రపు నాచుతో పాటు వివిధ రకాల చేపల పెంపకంపై అవగాహన కల్పించారు. అధిక ఆదాయం సంపాదించడానికి ఇది చక్కటి మార్గమన్నారు. మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ సత్యన్నారాయణ, డీపీఎం ఇ.నారాయణరావు, ఏపీఎం ప్రసాదరావు, సీసీలు, వీవోఏలు, స్వయంశక్తిసంఘాల మహిళలు పాల్గొన్నారు.

పత్రి అన్వేష్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం



పత్రి అన్వేష్‌ను డాక్టరేట్‌తో సత్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

సోంపేట: వైఎస్సార్‌సీపీ ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జనరల్ సెక్రటరీ పత్రి అన్వేష్‌కు జిల్లా పాస్టర్స్ క్రిస్టియన్ మినిస్ట్రీస్ వెల్ఫేర్ అసోసియేషన్, గ్లోబల్ ఇండిపెండెంట్ క్రిస్టియన్ అసోసియేషన్ సంయుక్తంగా గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసి శుక్రవారం సత్కరించింది. సోంపేట పట్టణంలోని ఆంధ్రా బాపిస్టు చర్చిలో రెండు రోజులుగా ఉజ్జీవన మహాసభలు నిర్వహించారు. పత్రి అన్వేష్ సామాజిక, సాంఘిక సేవలు గుర్తించి గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలు చర్చిల పాస్టర్‌లు బిషప్ గంజి, కొత్తపల్లి అబ్రహాం, జాషువా పాల్గొన్నారు.

పేదలకు వస్త్రదానం

ఇచ్ఛాపురం: సినీహీరో.. మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులు శుక్రవారం సేవా కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని రోగులకు రొట్టెలు, పండ్లను, బంగ్లా రోడ్డులోని పేదలకు వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యాధికారి పి.దేవేంద్రరెడ్డి, చిరంజీవి అభిమానులు అలీంఖాన్, అజయ్, ప్రసాద్, శ్రీను, అజ్జు, రాజు, చందు, మున్నా, బాస్కర్, వాసు, పుణ్యవాసులు ఉన్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

టెక్కలి రూరల్: ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న ఇద్దరు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సింగుహంతిపేటకి చెందిన కొంకి గణేష్ (27) స్నేహితుడితో కలిసి ఈ నెల 19వ తేదీ రాత్రి టెక్కలి నుంచి తమ గ్రామం వైపు వెళ్తుండగా.. శ్రీరంగం వద్ద అదుపుతప్పి బోల్తా పడ్డారు. గణేష్ తలకు తీవ్రగాయాలు కావడంతో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అలాగే పెద్దరోకళ్లపల్లి పంచాయతీ రెయ్యిపేట గ్రామానికి చెందిన సనపాన లోకేశ్వరరావు (37) ఈనెల 20వ తేదీన ఇంట్లో వచ్చిన చిన్నపాటి తగాద కారణంగా మనస్తాపానిగురై పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గుర్తించిన కుటుంబసభ్యులు లోకేశ్వరరావును టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు టెక్కలి పోలీసులు తెలిపారు.

చిరుద్యోగులకు 'మెగా'వాత!

- ఉద్దానం మంచినీటి ప్రాజెక్ట్ సిబ్బంది సేవలకు బ్రేక్
- మెగా రూపంలో ఉద్దానం పంప్ ఆపరేటర్లకు కత్తెర
- ఆందోళనలో పంప్ ఆపరేటర్లు



వాటర్ లీకేజ్ పనులు చేస్తున్న పంప్ ఆపరేటర్లు



వాటర్ పంప్ ఆపరేటర్ చేస్తున్న చిరుద్యోగి



మెగా కంపెనీకి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న పంప్ అపరేటర్లు (ఫైల్)

వజ్రపుకొత్తూరు రూరల్: కూటమి సర్కార్ చిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటుంది. ఉన్నఫలంగా ఉద్యోగాల నుంచి తొలగిస్తుండడంతో వారి కుటుంబాలు అల్లాడిపోతున్నాయి. మొన్న గ్రామ వలంటీర్లు, నిన్న రేషన్ డిపో వాహన ఆపరేటర్లు, నేడు మెగా కంపెనీ రూపంలో ఉద్దానం మంచి నీటి ప్రాజెక్ట్ పంపు ఆపరేటర్లపై కత్తెర పడింది. దీంతో గత 27 ఏళ్లుగా ఉద్దానం మంచి నీటి ప్రాజెక్ట్‌లో సేవలు అందిస్తున్న 105 మంది ఆపరేటర్ల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. కూటమి నాయకులు ఎన్నికల ముందు సంపద సృష్టిస్తాం, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పిస్తాం, నిరుద్యోగ భృతి అందిస్తామని హామీలు ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఉన్న ఉద్యోగులను తొలగించి చిరుద్యోగుల నడ్డివిరుస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెలబెట్టుకోవడంలో తీవ్రంగా విఫలం అవ్వడమే కాకుండా.. ఏళ్ల తరబడి జీవనాధారంగా పలు శాఖాలలో కాంట్రాక్ట పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్న చిరుద్యోగులను తొలగించడంతో కూటమి సర్కార్ అసలు స్వరూపం బయపడిందని ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి.

మెగా ప్రాజెక్ట్‌లో విలీనం

27 ఏళ్ల క్రితం ఉద్దాన ప్రాంత ప్రజలకు మంచినీరు అందించేందుకు ఈ ప్రాంతంలో అప్పటి ప్రభుత్వం ఉద్దాన మంచి నీటి ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించింది. అప్పటి నుంచి సిబ్బందికి సరైన జీతాల్లేక అనేక ఇబ్బందులు పడుతూనే శాశ్వత ఉద్యోగులుగా మారుతామనే ఆశతో కష్టాలను భరిస్తూ సేవలు అందించారు. ఉద్దాన ప్రాంతంలో కిడ్నీ బాధిత గ్రామాల్లో సురక్షిత నీరు అందించేందుకు గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా రూ.700 కోట్లు వ్యయంతో ఇంటింటికీ మంచినీరు అందించేందుకు వైఎస్సార్ సుజల ధార ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేశారు. నీటిని సరఫరా చేసేందుకు సిబ్బందిని నియమించారు. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం ఏళ్ల తరబడి సేవలు అందిస్తున్న 132 మంది ఉద్దాన మంచి నీటి ప్రాజెక్ట్ సిబ్బందిని కంట్రాక్ట్ పద్ధతిలో ఏప్రిల్ 25న మెగా ప్రాజెక్ట్‌లోకి విలీనం చేయగా వీరిలో 105 మంది పరిస్థితి ప్రస్తుతం ఆందోళనగా మారింది.

అగమ్య గోచరంగా ఆపరేటర్ల పరిస్థితి

ఉద్దానం ప్రాజెక్ట్‌ను నమ్ముకొని జీవనాన్ని సాగిస్తున్న పంప్ ఆపరేటర్లను మెగా కంపెనీ తొలగించేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు తమ ప్రాజెక్ట్‌లో అదనపు సిబ్బంది ఉన్నందున మీరు కొత్త అసైన్‌మెంట్‌ల కోసం ప్లాన్ చేసుకోవాలంటూ (ప్రత్యామ్నయ పనులు వెతుక్కోవాలని) ఈ నెల 13న కంపెనీ కో ఆర్డినేటర్ నుంచి 105 మందికి మెసెజ్ వచ్చింది. దీంతో సిబ్బంది పరిస్థితి ఆందోళనగా మారింది. విధుల నుంచి అర్థాంతరంగా తొలగిస్తే కుటుంబ పోషణ ఎలా అని ప్రశ్నిస్తున్నారు. రోడ్డున పడితే తమ పరిస్థితి ఏమిటి అంటూ మెగా ప్రాజెక్ట్ నిర్ణయానికి వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమం చేపడుతున్నారు. తమను కొనసాగించి ఆదుకోవాలని కోరుతున్నారు. వారు చేస్తున్న న్యాయం పోరాటానికి ప్రజా సంఘాలు మద్దతు పలుకుతున్నాయి.

తమకు న్యాయం చేయాలి



27 ఏళ్లుగా ఉద్దానం వాటర్ ప్రాజెక్ట్‌లో పని చేస్తున్న 132 మంది వర్కర్లను ఏప్రిల్ 25న మెగా కంపెనీలో విలీనం చేశారు. ఇప్పుడు అందులో ఉన్న 105 మంది సిబ్బందిని మెగా కంపెనీ తొలగించడం చాలా బాధాకరం. ప్రాజెక్ట్‌ను నమ్ముకొని జీవనోపాధి సాగిస్తున్న సిబ్బందిని కొనసాగించి తమకు న్యాయం చేయాలి.

– కె.నీలాచలం, ఉద్దానం ప్రాజెక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు, శ్రీకాకుళం

మాపొట్ట కొట్టొద్దు



ఉద్దానం మంచి నీటి ప్రాజెక్ట్ ప్రారంభం నుంచి విధులు నిర్వర్తిస్తున్నాం. ఇన్ని ఏళ్లుగా ప్రాజెక్ట్‌ను నమ్ముకొని జీవనోపాధి సాగిస్తున్న తమను తొలగించి పొట్ట కొట్టవద్దు. మెగా కంపెనీ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని తమను ఆదుకోవాలి.

– దుమ్ము శేశ్వరం, పంప్ ఆపరేటర్, కవిటి మండలం

కుంకుమార్చనలు..



కవిటి మండలం సీహెచ్ కపాసుకుద్ధిలోని భారతమాత ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవ అనంతరం పరిసర గ్రామాలకు చెందిన భక్తులు భారతమాతకు నిత్యదర్శనాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా 108 మంది మహిళలచే సామూహిక కుంకుమార్చనలు చేశారు. వేడుకల్లో భాగంగా శ్రీకాకుళానికి చెందిన మావుదూరు సత్యన్నారాయణశర్మచే వయోలిన్ సోలో సంగీత గాత్రకచేరీ నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. – కవిటి

పరిశీలన..



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఎన్టీఆర్ గృహ నిర్మాణాలను లబ్ధిదారులు వెంటనే పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు చెప్పారు. ఈ మేరకు గృహ నిర్మాణాలను శుక్రవారం పరిశీలించారు. ఎన్టీఆర్ హౌసింగ్ స్కీమ్‌లో 1966 ఇళ్లు మంజూరు కాగా అందులో 600 మంది నిర్మాణాలను పూర్తి చేశారని మిగిలిన వారు త్వరలో పూర్తి చేయాలన్నారు. – పలాస

అవగాహన..



సాగులో రసాయనాల వినియోగం తగ్గించాలని రాగోలు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త కె.మధుకుమార్ సూచించారు. పీఎం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం టెక్కలి మండలం పోలవరంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సాగులో రసాయనాల వినియోగం తగ్గించి జీవన ఎరువులను వాడాలన్నారు. మోతాదుకు మించి యూరియా వాడొద్దని, రైతులంతా నానో యూరియాపై దృష్టి సారించాలన్నారు. సర్పంచ్ జి.బాలకృష్ణ, వ్యవసాయాధికారులు వై.సురేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు. – టెక్కలి

దివ్యాంగుల పింఛన్ల రద్దు సంపద సృష్టా?



మాట్లాడుతున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి తదితరులు

కంచిలి: నిజమైన దివ్యాంగుల పింఛన్లను రద్దు చేయడం సంపద సృష్టా అని ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి ప్రశ్నించారు. మండల వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఒక్క కొత్త పింఛన్ మంజూరు చేయనప్పటికీ, ఇప్పుడు నిజమైన దివ్యాంగుల పింఛన్లను అకారణంగా రద్దు చేయడం వారిని ఇబ్బంది పెట్టడమేనని అన్నారు. మండలంలో 121 దివ్యాంగుల పింఛన్లు రద్దు చేస్తూ లబ్ధిదారులకు ఇటీవల నోటీసులిచ్చారని, రానున్న నెలలో వీరందరి పింఛన్లు ఆగిపోనున్నాయన్నారు. తర్వాత నెలలో మరో 31 మందిని తొలగించడానికి నోటీసులివ్వబోతున్నట్లు తెలుస్తోందన్నారు. మరో 29 మంది దివ్యాంగ పింఛనుదార్లను వృద్ధాప్య పింఛన్లు ఇచ్చేందుకు కన్వర్టు చేశారని పేర్కొన్నారు. మండలంలో అన్ని కేటగిరీలకు చెందిన పింఛన్లు 2024 ఫిబ్రవరి నాటికి 9,912 ఉండగా, 2025 ఆగస్టు నాటికి వాటిని 9,581కి కుదించారని ఆరోపించారు. మండలవ్యాప్తంగా 331 పింఛన్లు అన్ని కేటగిరీలు కలిపి తగ్గాయని వివరించారు.

సరిపడా ఎరువులు ఇవ్వక అవస్థలు..

కూటమి ప్రభుత్వ పాలనలో రైతులకు కావల్సిన ఎరువులు కూడా సరిపడా ఇవ్వడం లేదని ఎంపీపీ దేవదాస్‌రెడ్డి ఆరోపించారు. మండలానికి 11,259 ఎకరాలకుగాను, ఎకరానికి రెండు బస్తాలు చొప్పున ఇవ్వాలి ఉండగా, ఇప్పటి వరకు కేవలం మూడు వేలు బస్తాలు మాత్రమే సరఫరా చేశారని, మిగతా సరఫరా చేయలేదన్నారు. దీంతో రైతులు ఒడిశా రాష్ట్ర పరిధి నుంచి ఒక యూరియా బస్తాను రూ. 600 చొప్పున కొనుగోలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 2023 ఖరీఫ్‌లో మండలంలో కరువుతో పంటలు పండక రైతులు అల్లాడిపోవడంతో అప్పట్లో ఈ–క్రాప్‌లో నమోదు చేసిన రైతులందరికీ నష్టపరిహారం ఇవ్వాల్సి ఉండగా కూటమి ప్రభుత్వం ఆ పరిహారాన్ని ఇంతవరకు అందజేయలేదని గుర్తు చేశారు. ఈ విషయమై పలుసార్లు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో, సంబంధిత ఫైల్ సీఎం వద్ద పెండింగ్‌లో ఉందని చెప్పారని ఎంపీపీ తెలిపారు. పంటల బీమా ప్రభుత్వమే రైతుల తరఫున చెల్లించడం పరిపాటని..అయితే కూటమి ప్రభుత్వంలో మాత్రం రైతులకే చెల్లించమని చెప్పడం పట్ల వీరికి రైతాంగంపైన ఎంతటి బాధ్యత ఉందో అవగతమవుతుందని ఎద్దేవా చేశారు.

పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దుర్గాసి ధర్మారావు, మండల పార్టీ నేత లద్దు కేశవపాత్రో, జేసీఎస్ కన్వీనర్ కొణపల సురేష్, నియోజకవర్గ పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు పలికల జయరాం, బొగాబెణి సర్పంచ్ గణప సింహాచలం, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు మద్దు అభిరాం పాల్గొన్నారు.

ముగిసిన శ్రావణ పూజలు



ఇచ్ఛాపురం: ప్రత్యేక పూజలందుకున్న స్వేచ్ఛావతి అమ్మవారు



ఇచ్ఛాపురం: పుష్పాలంకరణలో లక్ష్మీదేవి



సోంపేట: మొగిలిపువ్వుల అలంకరణలో కనకదుర్గాదేవి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం గ్రామదేవత స్వేచ్ఛావతి, ముత్యాలమ్మ అమ్మవార్ల ఆలయాల్లో శ్రావణమాస పూజలు శుక్రవారంతో ముగిశాయి. చివరి శుక్రవారం సందర్భంగా ఆలయాల్లో కొలువైన లక్ష్మీదేవికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవార్ల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి లలితా సహస్రనామార్చన, ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో పాల్గొన్న మహిళలకు లక్కీ డ్రా తీశారు. విజేతలకు మొదటి బహుమతిగా బంగారు, ద్వితీయ బహుమతిగా వెండి, తృతీయ బహుమతిగా చీరను ప్రధానం చేసారు. ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సోంపేట: సోంపేట గ్రామ దేవత సోమపోలమాంబదేవి శ్రావణ శుక్రవారం సందర్భంగా సంతానలక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే బారువ కనక దుర్గమ్మకు ఆలయ అర్చకులు మొగలి పువ్వులతో అలంకరణ చేశారు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ పరీక్ష

ఇచ్ఛాపురం: ప్రతిభావంతులైన పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు జేసీఐ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్ అందజేయాలని నిర్ణయించినట్లు ఆ సంస్థ అధ్యక్షులు జయదేవ్ చెప్పారు. ఈమేరకు స్థానికంగా శుక్రవారం స్కాలర్‌షిప్ కోసం పరీక్షను నిర్వహించారు. కార్యక్రమంలో జేసీఐ ప్రతినిధులు స్నిగ్ధ, శిరీష, సతోష్‌సాహు, షణ్ముఖ్ పాల్గొన్నారు.

గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి

పలాస: గణేష్ మండపాల ఏర్పాటు కోసం విధిగా అనుమతులు తీసుకోవాలని కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటఅప్పారావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ప్రతి పూజా కమిటీ కూడా అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో ధరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో చేసిన దరఖాస్తు సంబంధిత ఎస్‌హెచ్‌వోకి వెళ్తుందన్నారు. పురపాలక, అగ్నిమాపక, విద్యుత్ శాఖల సిబ్బంది బృందంగా ఏర్పడి పరిశీలించిన తర్వాత అనుమతి వస్తుందన్నారు.

అస్తవ్యస్తంగా టెక్కలిపట్నం రోడ్డు పనులు



బెర్మలు వేయకుండా వేసిన రోడ్డు



గోతులు కూరుకుపోయిన వాహనం, నిలిచిపోయిన వాహనాలు

పలాస: టెక్కలిపట్నం రోడ్డు పనులు అస్తవ్యస్తంగా జరుగుతున్నాయి. టెక్కలిపట్నం నుంచి రేగులపాడు వరకు ఆర్అండ్‌బి అధికారులు సీసీ రోడ్డు పనులు చేయిస్తున్నారు. దానికి ముందుగా ఆఫ్‌షోర్ రిజర్వాయరు పనులు జరుగుతుండటంతో టెక్కలిపట్నం నుంచి పర్లాకిమిడి వెళ్లే రోడ్డులో ఊరు మధ్యలో సిమ్మెంటు రోడ్డు వేయిస్తున్నారు. ఈ గ్రామం మీదుగా నిత్యం ట్రాఫిక్ ఉంటుంది. ప్రభుత్వ వాహనాలతో పాటు ప్రైవేటు వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. అందులో పెద్ద పెద్ద లారీలు కూడా వెళ్తుంటాయి. ముందుగా ఇది డబుల్ రోడ్డు కావడంతో ఒక పక్క సిమెంట్ రోడ్డు వేశారు. ఆ రోడ్డుకు ఇరువైపుల బెర్మలు వేయలేదు. ఇంతలోనే దాని పక్కనే ఆనించి మళ్లీ సిమెంటు రోడ్డు కోసం గోతులు తవ్వేశారు. దీంతో ఆ రోడ్డుమీదుగా వెళ్లే వాహనాలు ఎదురెదురుగా తప్పించుకోలేని పరిస్థితి నెలకొంది. శుక్రవారం ఒక వాహనం పక్క తవ్వి వదిలేసిన గోతిలో ఇరుక్కుంది. దీంతో ట్రాఫిక్ సమస్య ఎదురైంది. గ్రామం మధ్య నుంచి ఈ రోడ్డు ఉండటం, ఇరువైపులా వివిధ దుకాణాలు ఉండటంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. ముందుగా ఒక పక్క రోడ్డు వేసి, దానికి ఇరువైపుల బెర్మలు వేసిన తర్వాత ఆ పక్కన దానికి ఆనించి రోడ్డు వేయాలని కోరుతున్నారు.

దివ్యాంగుల పింఛన్ల తొలగింపు తగదు



నడుపూరు శ్రీరామమూర్తి, ఎంపీపీ

నందిగాం: దివ్యాంగుల పింఛన్లను తొలగించి మానసిక్షోభకు గురిచేయడం కూటమి ప్రభుత్వానికి తగదని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 4.50 లక్షల పింఛన్లను వివిధ కారణాలను సాకుగా చూపించి తొలగించారని గుర్తుచేశారు. పెంచిన పింఛన్ మొత్తం కంటే తొలగించిన పింఛన్ల ద్వారా మిగిలే సొమ్ములే అధికమన్నారు. తొలగించినవి చాలవన్నట్లు దివ్యాంగుల పింఛన్లు ఏరివేసేందుకు చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. నందిగాం మండలంలోనే 120 మంది దివ్యాంగ పింఛన్లు తొలగించారని గుర్తుచేశారు. ఎన్నికల ముందు బీసీ వారికి 50 ఏళ్లకే పింఛన్ అని చెప్పి అధికారంలోకి వచ్చాక చంద్రబాబు ఇంతవరకు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. 2023 జనవరి ముందు వరకు ఉన్న వితంతువులకు ఇప్పటికీ పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా ఇవ్వకుండా ప్రభుత్వం మోసం చేస్తుందని దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా అన్నివర్గాల వారికి పింఛన్లు అందజేస్తే ఈ ప్రభుత్వం ఉన్న పింఛన్లను తీసివేసి వారందరికీ ఆందోళనకు గురిచేస్తుందని అన్నారు.

చిరు బతుకులకు 'తోడు' లేనట్లే!

- చిరు వ్యాపారులకు కొరవడిన భరోసా
- వడ్డీలేని రుణాల ప్రస్తావన లేని కూటమి ప్రభుత్వం
- గతంలో చిరు వ్యాపారులకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ సర్కార్



పండ్ల వ్యాపారం చేస్తున్న చిరు వ్యాపారులు

ఇచ్ఛాపురం రూరల్: కుటుంబాన్ని పోషించేందుకు అప్పులు తెచ్చి రోడ్డు పక్కన వ్యాపారాలు చేస్తూ అధిక వడ్డీలు కట్టలేక సతమతమవుతున్న చిరు వ్యాపారులకు గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలిచింది. వారి వ్యాపార పెట్టుబడి కోసం రూ.10 వేలు వడ్డీ లేకుండా రుణం అందించి ఆర్థికాభివృద్ధికి భరోసా కల్పించింది. దీంతో ప్రైవేటు వ్యాపారుల నుంచి అప్పులు తెచ్చుకొనే పరిస్థితి ఉండేంది కాదు. అప్పులను సకాలంలో చెల్లించడంతో బ్యాంకులు సైతం వారికి ఇతర రుణాలు ఇచ్చేందుకు ముందుకొచ్చేవి. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వీధి వ్యాపారులకు భరోసా లేకుండా పోయింది. దీంతో ప్రైవేటు వ్యాపారుస్తుల నుంచి పెట్టుబడి కోసం అధిక వడ్డీలకు సొమ్ము తెస్తున్నారు. వ్యాపారంలో వచ్చిన లాభమంతా వడ్డీలు కట్టేందుకే సరిపోతుందని వాపోతున్నారు. రోజుకు రూ.500 సంపాదిస్తే దానిలో సుమారు రూ. మూడు వందలు వడ్డీ కింద కట్టాల్సిన పరిస్థితి. దీంతో కుటుంబం గడవడం కష్టంగా మారింది. వీధి వ్యాపారుల కష్టాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో చూసి చలించిపోయారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే 'జగనన్నతోడు'పథకం ద్వారా వారికి వడ్డీ లేకుండా రుణం అందించారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట మండలాలతో పాటు ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో నాలుగేళ్లలో 12 వేల మంది చిరు వ్యాపారులకు రూ. 16 కోట్లకు పైగా రుణాలు అందించారు. అంతే కాకుండా సకాలంలో చెల్లించిన వారికి ఏటా మరో రూ.1000 చొప్పున జోడిస్తూ వడ్డీలేని రుణాన్ని అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరే విధంగా వలంటీర్ల సాయంతో రుణాలు అందించే ఏర్పాట్లు చేశారు. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం చిరు వ్యాపారుల జీవన భృతి గురించి పట్టించుకోవడం మానేసింది. దీంతో ప్రస్తుతం బ్యాంకులు వీరికి ఎటువంటి రుణాలు మంజూరు చేయడం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అప్పట్లో వీధి వ్యాపారులకు ఇచ్చే రుణాలుకు సంబంధించిన వడ్డీ ప్రభుత్వం ఆయా బ్యాంకులకు చెల్లించేది. దీంతో బ్యాంకులు సైతం వీధి వ్యాపారులకు రుణాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చేవారు. ప్రస్తుతం బ్యాంకులకు వీధి వ్యాపారుల రుణాలు విషయంతో ప్రభుత్వం ఎలాంటి మార్గదర్శకాలు జారీ చేయకపోవడంతో వడ్డీలేని రుణాలు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

రుణం అండగా నిలిచేది



గత ప్రభుత్వం తమకు అండగా నిలిచి వడ్డీ లేకుండా రుణం ఇచ్చింది. దీంతో మాకు ఎంతో ఆసరాగా ఉండేది. ఇచ్చిన రుణంతో దుస్తులకు అవసరమైన సామాగ్రిని కొనుగోలు చేసి వచ్చే డబ్బులతో కుటుంబాన్ని పోషించుకునేవాళ్లం. అంతే కాకుండా ప్రతీ ఏడాది 'జగనన్న చేదోడు'పథకం ద్వారా పది వేల రూపాయలు ఆర్థికంగా అందేది. ప్రస్తుతం బ్యాంకుల్లో వడ్డీలేని రుణాలు ఇవ్వడం లేదు. దీంతో బయట వ్యాపారస్తుల వద్ద అధిక వడ్డీకి అప్పులు తెచ్చుకోవాల్సి వస్తోంది.

– బి.రవి బెహరా, టైలర్, ఇచ్ఛాపురం మండలం



వ్యాపారానికి ఆర్థిక తోడు

నేను బోండాలు, బజ్జీలు, గారెలు వంటి తినుబండారాలు తయారీ చేసి స్థానికంగా చిన్నపాటి షెడ్‌లో అమ్ముతుంటాను. పెట్టుబడి పోనూ రోజుకు వంద రూపాయలు వరకు లాభం వస్తుండటంతో కుటుంబాన్ని పోషించుకుంటూ వస్తున్నాను. గత ప్రభుత్వ హయాంలో జగన్న తోడు పథకం ద్వారా వడ్డీ లేకుండా బ్యాంకు ద్వారా రూ. పదివేలు రుణం తీసుకునేవాళ్లం. ప్రస్తుతం ఇటువంటి పథకం లేదంటూ అధికారులు చెబుతున్నారు. దీంతో సామగ్రి పెట్టుబడికి వడ్డీకి అప్పు తెచ్చుకొని వ్యాపారం చేస్తున్నాను.

– బినోద్ సాహూ, చిరు వ్యాపారి, ఇచ్ఛాపురం